పనులకు గ్రహణం.. వీడాలి తక్షణం

- ఆగిన మనబడి నాడు–నేడు పనులు
- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముందుకు సాగని వైనం
- పెండింగ్ పనులు పూర్తి చేయాలంటున్న ప్రజానీకం





నిలిచిపోయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

వేంపల్లె : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యనందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో మనబడి నాడు– నేడు పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి ఆ పనులు నిలిచిపోయాయి. చివరి దశలో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేసవి సెలవుల్లోనైనా పూర్తి చేసి పాఠశాల పునఃప్రారంభానికి అందుబాటులోకి తీసుకొస్తారని స్థానిక ప్రజలు భావిస్తున్నప్పటికీ.. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిధులు ఉన్నా మిగిలిన పనులను పూర్తి చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

1700 మంది విద్యార్థులు విద్యాభ్యాసం

వేంపల్లెలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దాదాపు 1700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అంతేకాకుండా చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఈ పాఠశాలకు వచ్చి చదువును కొనసాగిస్తున్నారు. ఇక్కడ విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యధిక మార్కులు సాధిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో కొన్ని తరగతులు చెట్ల కింద, స్కూల్ కాంపౌండ్ ఆవరణలో నిర్వహిస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ. 3.34 కోట్లతో పనులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.3.34 కోట్ల నిధులు మంజూరు చేసింది. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో పనులకు శ్రీకారం చుట్టారు. రెండంతస్తుల భవనంలో తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. దాదాపు 70 శాతం పనులను పూర్తి చేశారు. ఎన్నికలు రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. ఎలక్ట్రికల్, టైల్స్, పెయింటింగ్స్, డోర్స్, బల్లలు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో ఎక్కడి పనులు అక్కడే :

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కొత్తగా నిర్మించిన రెండంతస్తుల భవనంలో ఫ్లోరింగ్, కిటికీలు, డోర్స్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా మిగిలిన పనులు పూర్తి చేయడంలో అధికారులు ఎలాంటి శ్రద్ధ కనబరచడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. మిగిలిన పనులు ఈ వేసవి సెలవుల్లో పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికైనా అందుబాటులోకి తీసుకొస్తారో, లేదోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి పెండింగ్ పనులు పూర్తి చేసి అదనపు తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకరావాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల నూతన తరగతి అదనపు గదులను వినియోగంలోకి తీసుకురావాలి. ఎలక్ట్రికల్, పెయింటింగ్, ఫ్లోరింగ్, తాగునీటి తదితర పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి. నిధులు ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. ఈ వేసవి సెలవుల్లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి. లేనిపక్షంలో విద్యార్థులకు అవస్థలు తప్పవు. కావున పాలకులు సానుకూల ధోరణితో ఆలోచించాలి.

– అమరావతి కేశవ, విద్యార్థి తండ్రి, వేంపల్లె

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. నిధులు ఉన్నా పెండింగ్ పనులను పూర్తి చేయకుండా అడ్డుకుంటున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్పొరేట్ విద్యనందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చించి నూతన తరగతి భవనాలను నిర్మించింది. ఇలాంటి అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడం మంచి పద్ధతి కాదు.

– షేక్ నిస్సార్ బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శి, వేంపల్లె

ఆధార్ కేంద్రాలు లేక అవస్థలు



గ్రామ సచివాలయాన్ని సందర్శించి, మాట్లాడుతున్న వార్డు మెంబర్ ఆంజనేయులు

వేంపల్లె : గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలోని 7వ గ్రామ సచివాలయాన్ని 17వ వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు సందర్శించారు. అలాగే ఆధార్ కార్డు కేంద్రంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ కేంద్రాలను గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ.. ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు కాలేదని తెలిపారు. ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లి ప్రదక్షిణలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా 17వ గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రం పని చేయడం లేదని అన్నారు. వేంపల్లెలో ఒక ప్రైవేట్ ఆధార్ కేంద్రం మాత్రమే ఉండటంతో.. అక్కడి నిర్వాహకుడు చెప్పిన విధంగా ప్రజలు నడుచుకోవల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో.. ప్రజలకు ఎక్కువ ఖర్చు, సమయం కూడా వృథా అవుతోందన్నారు. పనులు విడిచి పెట్టి ప్రైవేట్ ఆధార్ కేంద్రం వద్ద గుంపుగా వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై మహానాడులో సీఎం ప్రకటన

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



మహానాడు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, టీడీపీ నేతలు

జమ్మలమడుగు : కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే మహానాడులో ప్రకటన చేయడం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. జిల్లాలో మహానాడు జరుగుతున్న నేపథ్యంలో జమ్మలమడుగు నుంచి పార్టీ శ్రేణులను తరలించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, స్థానిక టీడీపీ నేతలతో మంత్రి చర్చించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయడంతోపాటు పరిశ్రమలు రప్పించింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకుని రావడం కోసం మంత్రి నారాలోకేష్ విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కడపలో జరగబోయే మహానాడుకు ఐదు లక్షల మందికి పైగా వస్తారని అంచనా వేయడం జరిగిందన్నారు. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు కూడా పూర్తి చేశామన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి భారీగా టీడీపీ అభిమానులు రావడానికి సిద్ధంగా ఉన్నారని ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం మహానాడు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అత్యుత్సాహం



పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెకు వెళ్లే రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం చుట్టూ కట్టిన పసుపు జెండాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడపలో ఈ నెల 27, 28, 29వ తేదీలలో నిర్వహించే మహానాడు సందర్భంగా టీడీపీ నేతలు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. పులివెందుల రింగురోడ్డులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల చుట్టూ పసుపు జెండాలు కట్టి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. అలాగే పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం, కడప రోడ్డులోని చందమామ దాబా వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం, రింగు రోడ్డు చుట్టూ ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు టీడీపీ శ్రేణులు పసుపు జెండాలను కట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలా కట్టడం సరికాదని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

యోగా.. ఆరోగ్యం పదిలంగా



లింగాల : యోగా శిక్షణ తరగతుల్లో అధికారులు, సిబ్బంది



పులివెందుల టౌన్ : యోగాపై అవగాహన కల్పిస్తున్న గురూజీ వెంకట్రామిరెడ్డి



సింహాద్రిపురం : యోగాపై శిక్షణ ఇస్తున్న పీఈటీ జేసునాథరెడ్డి

పులివెందుల టౌన్ : రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో యోగాంధ్రపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురూజీ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ యోగాను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని జూన్ 21వ తేదీని ప్రపంచ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. నెలరోజుల పాటు యోగా దినోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సూచించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సాధన చేయాలి

లింగాల : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ రోజు యోగా సాధన చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా శిక్షణ తరగతులు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం లింగాల జెడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్ అధికారులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ, విద్య, వైద్య శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

30 వరకు శిక్షణ

సింహాద్రిపురం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో యోగాంధ్రపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవరంగుంటపల్లె జెడ్పీ హైస్కూలు పీఈటీ జేసునాథరెడ్డి సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అనంతరం జేసునాథరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు రోజూ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు యోగా క్లాసులు నిర్వహిస్తామన్నారు. ఈ యోగా క్లాసులకు సచివాలయ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలన్నారు.

రహదారి మలుపు.. ప్రమాదానికి పిలుపు



చంద్రగిరి గ్రామానికి వెళ్లే దారిలోని మలుపు



నల్లపురెడ్డిపల్లెకు వెళ్లే రహదారిలో ఉన్న మలుపు

- ప్రధాన రోడ్లలో తరచూ ప్రమాదాలు
- కనిపించని సూచిక బోర్డులు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని రోడ్డు మలుపులు.. ప్రమాదాలకు పిలుపులుగా మారుతున్నాయి. ప్రధానంగా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె, కనంపల్లె తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామాల్లో ఉన్న రహదారులపై వందల సంఖ్యలో రోజూ వాహనాలు తిరుగుతుంటాయి. ప్రధాన రహదారుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో.. ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం పరిధిలోని పులివెందుల నుంచి నల్లపురెడ్డిపల్లె గ్రామానికి 6కి.మీ పరిధిలో 15 మలుపులు ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా.. మలుపులు వద్ద సూచిక బోర్డులు లేవు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా కొందరు గాయాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రాణనష్టం జరగకముందే మలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



పులివెందుల మండల పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లోని మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయాల్లో సూచిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మలుపుల వద్ద వెంటనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– విష్ణు, స్థానికుడు, నల్లపురెడ్డిపల్లె

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి



గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల మలుపుల వద్ద ప్రమాదకరంగా మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపుల వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవడంతో.. రోజూ ఏదోక గ్రామానికి వెళ్లే రహదారిలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల వద్ద వాహనాలు అదుపు తప్పి బోల్తా పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

– శివ, స్థానికుడు, పులివెందుల

బీసీ రుణాలకు సబ్సిడీ విడుదల చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : మంజూరైన బీసీ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సబ్సిడీ విడుదల చేయాలని, మంజూరు కాని రుణాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పేద బీసీ కులాల వారికి ప్రకటించిన సబ్సిడీ రుణాలు జనాభాకు తగ్గట్టు లేవని విమర్శించారు. ప్రకటించిన రుణాలు కొన్నే అయినప్పటికీ ఇంతవరకు సబ్సిడీ మంజూరు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. జిల్లాలో సుమారు 1650 మంది లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు వీరికి రుణాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, రాయలసీమ ఎస్సీ ఎస్టీ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఫోరం కన్వీనర్ జేవీ రమణ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మనోహర్, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ ఆంజనేయులు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పించారు.

పోస్టల్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 31 నుంచి జూన్ 4 లోపల పోస్టల్ ఖాతాదారులు తమ ఖాతాలకు ఆధార్‌తో బ్యాంకు ఖాతాలకు అను సంధానం చేసుకోవడం కోసం ఎన్‌పిసిఐ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కడప విడివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నా రు. సోమవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఖాతాదారులు ఆధార్‌తో బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో సుమా రు 51 లక్షల మంది బ్యాంకు ఖాతాలు సీడింగ్ లేని కారణంగా తమ శాఖ ఆధ్వర్యంలో గత ఏడాది స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. పోస్టల్ శాఖ, సచివాలయ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వాధికారుల సమన్వయంతో జూన్ 5 లోగా ఆధార్ సీడింగ్ ఎన్‌పీసీఐ లింకేజీ తెరవడంతో పాటు వారికి నూతన పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాలను తెరవనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోడల్ డీఎస్సీ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : జిల్లా వ్యాప్తంగా ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పరీక్షను జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డీఎం ఓబులేసు తెలిపారు. సోమవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎఫ్ పోరాటాల ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిందన్నారు. ప్రముఖ విద్యావేత్తల ద్వారా మోడల్ డీఎస్సీ ప్రశ్నా పత్రాన్ని తయారు చేయించామన్నారు. మెగా డీఎస్సీ ఎంట్రెన్స్ రాసే నిరుద్యోగులకు ఈ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పరీక్ష కేవలం ఎస్‌జీటీ అభ్యర్థులకు మాత్రమేనని, కడపకు చెందిన ఆసక్తి గల వారు రూ.50 ప్రవేశ రుసుం చెల్లించి 86399 19308 నంబర్‌కు సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన వారు 70366 95591 నంబర్‌కు, జమ్మలమడుగుకు చెందిన వారు 88862 38055 నంబర్లకు సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్జీటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేతకు చర్యలు



శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కమలాపురం : కమలాపురం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే దారిలో ఉన్న ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో.. కూల్చి వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. స్థానికంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల్లో కూల్చివేత పనులు చేపడుతామని పేర్కొన్నారు. ఆ సమయంలో పట్టణంలోని కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

గండి అంజన్న సన్నిధిలో మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నాయుడుకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

చక్రాయపేట : రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కేసరి రాజా రమేష్, రాజగోపాల్ ఆచార్యులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారు మంత్రిని సత్కరించి ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గండి ఆలయ మాజీ చైర్మన్ వెంకటస్వామి, టీడీపీ నేత షబ్బీర్ తదితరులు ఉన్నారు.

దేశ ఆర్థిక ప్రగతిపై హర్షం



పీఎం నరేంద్రమోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : భారత దేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నీతి ఆయోగ్ ప్రకటించడంపై బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వేంపల్లెలో ఆయన బీజేపీ నాయకులతో కలిసి పీఎం నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న మన దేశ ఆర్థిక వ్యవస్థను నాల్గవ స్థానానికి చేర్చడం శుభ పరిణామని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ వల్ల ప్రజల్లో విశ్వాసం, ధైర్యాన్ని నింపారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మిరెడ్డి, శివశంకర్ రెడ్డి, దొంతు సుమన్, ఈశ్వరరెడ్డి, తులసీ నాయుడు, రంగారెడ్డి, సునీల్ కుమార్, జగదీష్, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు పోరాటం



సమావేశంలో దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు

పులివెందుల టౌన్ : క్రైస్తవుల హక్కుల పరిక్షణకు ప్రతి ఒక్కరం శ్రమిద్దామని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్ తెలిపారు. సోమవారం పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో ఉన్న యేసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఆలియన్స్ ఫర్ పాస్టర్స్ డెవలప్‌మెంట్ (ఏపీడీ), క్రైస్త హక్కుల పరిరక్షణ దళం (సీఆర్పీ ఫోర్స్) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల్లో ఐక్యత లోపించడం వలనే ఎక్కువగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఆలియన్స్ ఫర్ పాస్టర్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు ఆర్.ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రైస్తవ సమాజం కోసం పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు ఉదయ్ కిరణ్, కృపరాజు దేవరాజు, క్రాంతి రాజు, ప్రసాద్, లాజరస్, ఆనంద్ బాబు, అబ్నేర్ రాజు, విజయ్ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అదనంగా ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పి ఏడాది గడుస్తోందని, నిధులు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.మనోహర్ బాబు, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ డిమాండ్ చేశారు. సోమవారం విలేకర్లతో వారు మాట్లాడుతూ గండికోట జలాశయం కింద సర్వం కోల్పోయిన నిర్వాసితులు సుదూర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్తున్నారన్నారు. జీవనోపాధి కోసం ఓ చిన్న పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. పునరవాస కేంద్రాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సుబ్బరావు, మైనార్టీ నాయకుడు ఎస్.ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టర్ల ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : తమ డిమాండ్ల సాధన కోసం హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్ల సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కడప హెచ్‌పీసీఎల్ భాకరాపేట టెర్మినల్‌లో స్థానిక ట్రాన్స్‌పోర్టర్లకే మొదటి అవకాశం కల్పించాలని కోరారు.